Deli

6-1-1988



పాండురంగయ్య

# శ్రమించి ఎదిగిన రైతు

అనంతపురం, జనవరి 5 (న్యూస్‌టుడే): 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న సత్యానికి అనుగుణంగా శ్రమించి నవీనపద్ధతులు అవలంబించిన గొంది పాండురంగయ్య అనే రైతు గణేష్‌దానిమ్మపంటలో అధికదిగుబడి సాధించారు. ఇప్పటివరకూ దేశంమొత్తంమీద ఏ రైతు పండించని నాణ్యమైన కాయలను పండించారు. పాండురంగయ్య అనంతపురం శివారులోని తన నాలుగు ఎకరాలపొలంలో దానిమ్మపంట పెట్టారు. సాధారణంగా దానిమ్మకు ఆశించే చీడలు, పక్షులను నిరోధించటానికి నవీనపద్ధతులు అవలంబించినట్లు ఆ రైతు చెప్పారు. చీడలు వ్యాపించకుండా హార్మోనేలుమధులక్స్‌ఇన్, జిబ్రాలిసోలు పిచికారి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పక్షుల బారినుంచి కాయలను రక్షించేందుకు పొలంలో జెండాలు ఏర్పాటు చేశానని, దీనివల్ల పక్షులు చెట్లపైవాలలేదని చెప్పారు. సీతాకోకచిలుక దానిమ్మకాయలపై గుడ్లుపెట్టటంవల్ల బోరర్‌పురుగు తయారై కాయలను తినివేస్తుంది. పొలంలో తరచూ చెట్ల మధ్య మంటలు వేయటంద్వారా పొగలువ్యాపింపజేసి సీతాకోకచిలుకలు రాకుండా నిరోధించానని ఆ రైతు వివరించారు. పండ్లతోటల సమాఖ్య సలహాదారు సుధాకరరావు ఇచ్చిన సలహాలు అమలుపర్చటంవల్ల మంచిఫలితాలు లభించాయన్నారు. దీనితో మామూలు దిగుబడికి మూడురెట్లు దిగుబడి అదనంగా వచ్చిందని, ఎకరాకు పన్నెండు వేల కాయలు పండాయని వివరించారు. మధ్యదళారీల సమస్యను తొలగించుకునేందుకు కోయంబత్తూర్, మద్రాస్, తిరుపతి, హైదరాబాదు మార్కెట్లకు కాయలను తానే తీసుకెళ్ళి విక్రయించానని పాండురంగయ్య చెప్పారు. దీనివల్ల మామూలుగా దళారులు చెల్లించే ధరకన్నా రెట్టింపు ధరపొందగలిగానని తెలిపారు.